క్లుప్తంగా

యాజమాన్యం తీరును నిరసిస్తూ ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం: విద్యార్థి సంఘ నాయకులను దూషించిన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గీతా కృష్ణ, నాయకులు స్థానిక ఆర్డీవో హెచ్.వి.జయ రాంకు ఫిర్యాదు చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాకృష్ణ మాట్లాడుతూ మొహర్రం సెలవు దినం అయినప్పటికీ కళాశాల యాజమాన్యం తరగతులు నిర్వహించటంపై నిలదీశామన్నారు. ఆ సమయంలో ప్రైవేటు కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తమ నాయకులను మెడపట్టి నెట్టేయటం దారుణమన్నారు. యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాయీబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశమైన సంఘ సభ్యులు

నర్సీపట్నం: త్యాగరాజ నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం నర్సీపట్నం డివిజన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగభూషణంతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘ కార్యకలాపాలు కొనసాగడానికి వీలుగా నూతన అధ్యక్షుడు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. నాయీ బ్రహ్మణ కులదైవమైన ధన్వంతరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. వాయిద్య కళా రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సంఘ పెద్దలు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సమితి అధ్యక్షుడు పుల్లేటికుర్తి రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

పాల సంఘం అధ్యక్షుడిగా ముత్యాలనాయుడు



చల్లాతో కలిసి స్టీల్ క్యాన్లు పంపిణీ చేస్తున్న అధ్యక్షుడు ముత్యాలనాయుడు

కె.కోటపాడు: ఆర్.వై.అగ్రహారం పాల సంఘం అధ్యక్షుడిగా బొడ్డు ముత్యాలనాయుడును డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక పాల సంఘం ఆవరణలో ఎన్నిక నిర్వహించారు. నూతన అధ్యక్షుడు పాల సంఘ సభ్య రైతులకు స్టీల్ క్యాన్లను సమకూర్చగా, వీటిని డీసీసీబీ మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి పంపిణీ చేశారు. ఎంపీటీసీ యడ్ల రేవతి, పాల సంఘం డైరెక్టర్లు మండ శ్రీనివాసరావు, బోని సత్యనారాయణమూర్తి, యడ్ల పోతిబాబు, యడ్ల ముత్యాలనాయుడు, లెక్కల దేముళ్లు, రెడ్డి రామునాయుడు, యాళ్ల రమణ, గుంపాన దేముడు, యడ్ల అప్పారావు, పీఎస్ నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

రుద్ర మహాయాగానికి పట్టు వస్త్రాలు



పట్టు వస్త్రాలు అందించిన పద్మశాలీ సంఘం

చోడవరం రూరల్: స్థానిక స్వయంభూ గౌరీశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం పద్మశాలీ సంఘ సభ్యులు కుటుంబ సమేతంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి నక్షత్ర నవగ్రహ పూర్వక పంచాయతన సహిత చండి రుద్ర మహా యాగాన్ని నిర్వహిస్తున్నారు. పద్మశాలీ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సప్ప కొండలరావు, పప్పు శ్రీను, గౌరవాధ్యక్షుడు దొడ్డి వీర్రాజు, కార్యదర్శి కోసూరి నారాయణరావు, కోశాధికారి నేమాల హరి, సంయుక్త కార్యదర్శులు వంక సూర, దొడ్డి సత్యనారాయణ, గౌరవ సలహాదారులు బొజ్జ రామారావు, చుక్కల వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఆణిముత్యాలు

మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఏలుబడిలో పురుడుపోసుకున్న ట్రిపుల్ ఐటీలు గ్రామీణ పేద విద్యార్థులకు వరంగా మారాయి. వీటి ద్వారా చదువుకుని ఎంతోమంది ఇంజినీర్లుగా స్థిరపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఏటా వీటిల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఉన్నత చదువులకు ఎంపికైన పలువురు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

- నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపిక
- ఉన్నత చదువులకు అవకాశం
- గ్రామీణ విద్యార్థుల ఆనందం



దేవరాపల్లి మండలం తెనుగుపూడిలో డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారిలో..

- నర్సీపట్నం ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల నుంచి ఆర్.నిఖిల్ వర్మ నూజివీడు, పైల యశ్వంత్ ఒంగోలుకు, పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కోరుబిల్లి దిలీప్‌కుమార్, పిల్లా తేజస్వణి శ్రీకాకుళం ఐటీకి ఎంపికయ్యారు. వేములపూడి ఏపీ మోడల్ స్కూల్ నుంచి కె.లీలావర్షిణి, సిహెచ్.దుర్గా నాగమణి, జయకిశోర్, దాక్షయాని, మధుశ్రీ, రిష్మా, నర్సీపట్నం జెడ్పీ బాలికల హైస్కూల్ నుంచి ఎ.లక్ష్మణ్‌కుమారి, ఎస్. శివజ్యోతి ప్రియ, ఎస్.రేణుకాదేవి, చెట్టుపల్లి హైస్కూల్ నుంచి పి.వల్లవి, గబ్బాడ హైస్కూల్ నుంచి ఎ.జ్యోతి మేఘన, ఏపీఆర్ఎస్ స్కూల్ నుంచి సిహెచ్.దీపిక్ నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు.
- చోడవరం బాలికోన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఎం. నేహా, జి. నాగలక్ష్మి, టి. లీలాసాహిత, వై. యశ్వంతి, ఎస్. కల్పన నూజివీడుకు గవరవరం నుంచి ఎస్. రామకృష్ణ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.
- మాడుగుల మండలం కె.జె.పురం జెడ్పీ హైస్కూలు నుంచి అళ్ల ఉదయశ్రీ నూజివీడు, బుద్దా పరిమళ, వీరనారాయణం జెడ్పీ హైస్కూలు నుంచి రాపేట హేమశ్రీ, మాడుగుల జెడ్పీ బాలుర హైస్కూలు నుంచి తామరపల్లి హేమన్య, గాదిరాయి హైస్కూలు నుంచి పాము హేమలత, చీడికాడ మండలం ఖండివరం జెడ్పీ హైస్కూలు నుంచి అమలకంటి భాను సంపత్, కోనాం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల నుంచి జాగరపు చారిణి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. దేవరాపల్లి మండలం తెనుగుపూడి గురుకుల బాలుర పాఠశాల నుంచి ఉల్లి నవీన్ నూజివీడుకు కె.కోటపాడు మండలం చౌడువాడ జెడ్పీ హైస్కూలు నుంచి పాచిల లోష్టవి ఒంగోలు క్యాంపస్‌లో సీటు సాధించారు.

కంప్యూటర్ ఇంజనీర్ అవుతా...



నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో చదివి పది పరీక్ష ఫలితాల్లో 570 మార్కులు సాధించాను. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ రావడం ఆనందంగా ఉంది. నా తండ్రి సత్యనారాయణ ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నాడు. నాకు వచ్చిన అవకాశంతో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో రాణించడమే లక్ష్యం.

– కోరుబిల్లి దిలీప్‌కుమార్, విద్యార్థి, నర్సీపట్నం

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ట్రిపుల్ ఐటీ సీటు...



ఎంజేపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి వరకు చదివాను. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పరీక్షల్లో మంచి మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాను. నా తండ్రి టైల్స్ వర్కు చేస్తుంటాడు. ట్రిపుల్ ఐటీలో సీటు రావటం ఆనందంగా ఉంది. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎలక్ట్రానిక్ సైన్స్‌లో రాణిస్తా.

– ఆర్. నిఖిల్ వర్మ, పెదబొడ్డేపల్లి, నర్సీపట్నం

ఇంజనీర్ ఉద్యోగం సాధిస్తా



చౌడువాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యా. పాచిలవానిపాలెం గ్రామం నుంచి రోజూ రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి చదువుకునేదాన్ని. పదిలో 570 మార్కులతో మండల టాపర్‌గా పదిలో నిలిచాను. నా తండ్రి నారాయణరావు ఆర్టీసీ డ్రైవర్‌గా, తల్లి పావని వ్యవసాయ పనులు చేస్తుంటారు. ఇంజనీర్ ఉద్యోగాన్ని సాధించడమే లక్ష్యంగా ఉన్నత చదువులు సాగిస్తున్నాను.

– పాచిల లోష్టవి, పాచిలవానిపాలెం, కె.కోటపాడు మండలం

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా



మా నాన్న నాగఅప్పారావు వ్యవసాయం చేస్తారు. అమ్మ లక్ష్మి గృహిణి. నేను చోడవరం గరల్స్ హైస్కూల్‌లో చదివాను. పదో తరగతిలో 579 మార్కులు వచ్చాయి. న్యూజీవీడు ట్రిపుల్ ఐటీలో సీటు దక్కింది. చాలా ఆనందంగా ఉంది. నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని కావాలన్నది నా ఆశయం. అందుకే నేను ఆ దిశగా ఉన్నత చదువులు చదవాలని అనుకుంటున్నాను.

– మళ్ల నేహా, విద్యార్థిని, గోవాడ, చోడవరం మండలం

బిజినెస్ ఎనలిస్టు కావడమే ఆశయం



నేను బిజినెస్ ఎనలిస్టును కావాలని నా ఆశయం. ముందుగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా. మా అమ్మ అనూష లేరు. అన్నీ తానై మా నాన్న సూర్యారావు నన్ను చదివించారు. మా నాన్న ఎల్ఐసీలో పని చేస్తారు. గవర్నమెంటు స్కూల్‌లో చదివితేనే అన్ని రంగాల్లోనూ ముందుకు వెళతామని భావించి, చోడవరం బాలికోన్నత పాఠశాలలో చదివించారు. నాకు పదో తరగతిలో 569 మార్కులు వచ్చాయి. న్యూజీవీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను.

– శిలపరశెట్టి కల్పన, చోడవరం

ఐఏఎస్ కావాలన్నదే ధ్యేయం



మా నాన్న యర్రంశెట్టి శ్రీనువాసరావు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మా అమ్మ శ్రీలక్ష్మి గృహిణి. మా స్కూల్‌లో ఉపాధ్యాయులు ఎంతో బాగా పాఠాలు చెబుతారు. నేను చోడవరం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో చదివాను. పదో తరగతిలో 576 మార్కులు వచ్చాయి. నేను న్యూజీవీడు ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యాను. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యి, తర్వాత ఐఏఎస్ కావాలన్నదే నా ఆశయం.

– యర్రంశెట్టి యశ్వంతిసత్య, చోడవరం

తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటా



ఎన్‌సీసీ స్పెషల్ కేటగిరీలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాను. తెనుగుపూడి గురుకులంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి టెన్త్‌లో 531 మార్కులు సాధించాను. మా నాన్న శ్రీను ఎలక్ట్రిషియన్‌గా, అమ్మ కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారి రుణం తీర్చుకుంటాను. – ఉల్లి నవీన్, దేవరాపల్లి

కష్టపడి చదివాను



విద్యాభ్యాసంపై మక్కువతో బాల్యం నుంచి కష్టపడి చదివాను. నా తల్లిదండ్రులు ప్రోత్సాహంతోపాటు ఉపాధ్యాయుల సూచనలు, సలహాలతో నేను పదో తరగతిలో టాపర్‌గా నిలిచాను. నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. చాలా ఆనందంగా ఉంది. ఇంజనీర్ కావడం నా లక్ష్యం.

– అళ్ల ఉదయశ్రీ, కె.జె.పురం, మాడుగుల మండలం

తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి



వీరనారాయణం ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులతో పాసయ్యాను. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. మా తల్లిదండ్రులు ఆశయ సాధనకు కృషి చేస్తాను. ఉపాధ్యాయులు స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాను.

– రాపేట హేమశ్రీ, వీరనారాయణం, మాడుగుల మండలం

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



బుచ్చెయ్యపేట: తులసీమాలల అలంకరణలో వడ్డాది వేంకటేశ్వరస్వామి



నర్సీపట్నం: అలంకరణలో వేంకటేశ్వరస్వామి



రోలుగుంట: ఆలయంలో వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



మాడుగుల రూరల్: ఎం. కోడూరు లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత స్వామివారిని తులసీ, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. వడ్డాది కొత్తూరులోని గీతాశ్రమంలో వేంకటేశ్వరస్వామి, బుచ్చెయ్యపేట కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

చందన అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నర్సీపట్నం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని స్వామి వారి ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. నర్సీపట్నంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి తరలి రావడంతో ఆలయ ఆవరణ నుంచి మెయిన్ వరకు బారులు తీరారు.

మాడుగుల రూరల్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. స్వామివారికి పుట్టా కల్యాణరాజు, వెంకటలక్ష్మి దంపతులు నూతన వస్త్రాలు సమర్పించారు. కె.జె.పురం రామాలయంలో ఏకాహం ప్రారంభమైందని హరేరామ భజన మండలి కన్వీనర్ పిల్లి రాము తెలిపారు. ఎం. కోడూరు లక్ష్మీనారాయణస్వామి ఆలయంతోపాటు పలు గ్రామాల ఆలయాల్లో భక్తులు పూజలు, ఏకాహం నిర్వహించారు.

రోలుగుంట: స్థానిక కొండలపై పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు చేశారు. అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు విశాఖ, శ్రీకాకుళం అర్చకులు అనంత పద్మనాభ శర్మ, అప్రుతశర్మ, గోప నంబాల నల్లకూర్మన్న 108 కలశాలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ ఏర్పాట్లు చేశారు.

దేవరాపల్లి: మారేపల్లి పాండవుల మెట్టపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి తోపాటు దేవరాపల్లిలో స్వామివారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఇక్కడ భజనలు చేయడంతో ఆధ్యాత్మిక సందడి సంతరించుకుంది.

నాతవరం: మండలంలో వెదురుపల్లి మాధవనగరం మర్రిపాలెం గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా సీతారాములు, అమ్మవారి ఆలయాల్లో భక్తులు తాకిడి నెలకొంది.

బాలికలపై లైంగిక దాడులు సభ్య సమాజానికి సిగ్గు చేటు

జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ కమిటీ సభ్యుడు అప్పారావు



దేవరాపల్లి: రాష్ట్రంలో పోక్సో కేసులు పెరిగిపోవడాన్ని, ఆడబిడ్డలపై లైంగిక దాడులకు పాల్పడటాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కాటపల్లి అప్పారావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం దేవరాపల్లిలో ఆయన మాట్లాడుతూ పసి పిల్లలు, బాలికలపై లైంగిక దాడులు సభ్య సమాజానికి సిగ్గు చేటని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చిన్నారులపై లైంగిక వేధింపుల దృష్ట్యా తల్లిదండ్రులు తమ బిడ్డల భద్రతపై ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పోక్సో కేసులు అధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి రక్షణ నిమిత్తం చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎస్ సన్యాసిరావు

కె.కోటపాడు: విద్యార్థులు ఆహారాన్ని తీసుకునే ముందు చేతులను శుభ్ర పర్చుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు తెలిపారు. కొరువాడ వసతి గృహ విద్యార్థులకు ఆరోగ్య రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. చేతులు శుభ్రపర్చుకోకపోవడం వల్ల మలినాలు కడుపులోకి ప్రవేశించడం వల్ల రక్తహీనత సమస్య బారిన పడే అవకాశాలుంటాయని తెలిపారు. తద్వారా విద్యార్థులు త్వరగా అలసిపోవడం, ఎక్కువ సేపు ప్రయాణాలు చేయగలిగే శక్తిని కోల్పోనున్నట్లు వివరించారు. అదే విధంగా వసతిగృహం ప్రాంగణాలు పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్ఎస్.ప్రమీల, వసతి గృహాధికారి రామన్నదొర పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది

చోడవరం: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని నేచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్ చిన్న తెలిపారు. బుధవారం రావికమతం మండలం దొండపూడి రైతు సేవా కేంద్రంలో రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం, కోటవురట్ల, గొలుగొండ మండలాల్లో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు కలిగే లాభాలు గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని చిన్న చెప్పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున బీజామృతం, ద్రవజీవామృతం తయారీపై తెలియజేయాలన్నారు. వ్యవసాయ సిబ్బంది రాంగోవింద, వర్మ, రైతు సంఘ ప్రతినిధులు నాగేశ్వరరావు, శివకుమార్, రామకృష్ణ, గర్రెడ్డి గణావతి, సన్యాసినాయుడు, మహాలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా అండీళ్ల పండగ



వీరనారాయణంలో భక్తులు అండీళ్ల ఊరేగింపు

మాడుగుల రూరల్: వీరనారాయణంలో జగన్నాథ స్వామి అండీళ్ల (మట్టి గోనాలు) పండగ బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి తిరుగు రథయాత్ర రోజున ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తాచేరు నదికి వెళ్లి, అక్కడ నీరు నింపుకుని, తమ ఇళ్లకు చేరుకుని పరమాన్నం వండి భక్తులకు, కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు వడ్డించారు.

సంఘ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



హాజరైన దివ్యాంగులు

చోడవరం రూరల్: వికలాంగుల సంక్షేమ సంఘం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, సభ్యులు క్రమశిక్షణతో మెలగాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ నీలం నాగేంద్రబాబు తెలిపారు. మండల వికలాంగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం చోడవరంలో సంఘ అధ్యక్షుడు దుగ్గిరాల రవికుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అచ్యుతాపురం వికలాంగుల సంఘం అధ్యక్షుడు పీఎస్‌టీ పట్నాయక్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఓ రాంబాబు, లయన్స్ సర్వీస్ ప్రెసిడెంట్ ముక్కా రమేష్, ఆర్క్ కార్యదర్శి డీఎస్ ప్రసాద్, ఏఎస్ నాగభూషణం ముఖ్య వక్తలుగా ప్రసంగించారు. పెన్షన్ల విషయంలో దివ్యాంగులకు అన్యాయం జరగకుండా, స్క్రూటినీ పేరుతో తొలగింపులకు పాల్పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత ఉందన్నారు. వయసు, పర్సంటేజీలతో పని లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఉంచాలన్నారు. జిల్లాకు సంబంధించి తక్షణమే దివ్యాంగుల కార్యాలయంతోపాటు సమర్థులైన అధికారుల నియామకం చేపట్టాలని కోరారు. దివ్యాంగుల కోసం పరస్పర సహాయ సంఘాన్ని ఏర్పాటు చేయాలని పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. పది ప్రధాన డిమాండ్ల సాధనకు సంఘం నడుం బిగించి పోరాడాలని సంఘ ప్రతినిధులు, వక్తలు సూచించారు.

నూతన కార్యవర్గం...

సంఘ సర్వసభ్య సమావేశానంతరం మండల వికలాంగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షునిగా దుగ్గిరాల రవికుమార్, అధ్యక్షుడిగా శరగడం భూషణం, ఉపాధ్యక్షురాలిగా సాలాపు కుమారి, కార్యదర్శిగా సింగంపల్లి అనంత్, కోశాధికారిగా గొల్లమాల మంగతోపాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వేడుకగా జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర



మాడుగులలో జగన్నాథస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

మాడుగుల: జగన్నాథస్వామి తిరుగు యాత్ర బుధవారం సాయంత్రం మాడుగులలో కన్నుల పండవగా జరిగింది. ఈ నెల 7వ తేదీన సతకంపట్టు వద్ద స్వామివారి రథయాత్ర గవర వీధి సమీపంలో ఇంద్రద్యుమ్ను వద్ద కృష్ణాలయానికి చేరింది. అక్కడ 11 రోజుల పాటు పలు రూపాల్లో స్వామివారు భక్తులకు దర్శన మిచ్చారు. శయనైకాదశి పర్వదినం సందర్భంగా తిరుగు రథయాత్ర ఇంద్రద్యుమ్ను నుంచి జగన్నాథుని ఆలయానికి బయలుదేరింది. ఈ సందర్భంగా స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ఆదినారాయణ(స్వామి), పుట్టా బలరామ్, శ్రీనాధు రాంబాబు, జాగాని నానాజీ, భీమరశెట్టి పైడినాయుడు, మండల సతీష్, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు, పాల సొసైటీ అధ్యక్షుడు పాము వెంకట కృష్ణారావు, కార్యదర్శి గండి జోగినాయుడు పాల్గొన్నారు.

పశుగ్రాస విత్తనాలు సిద్ధం



లారీ నుంచి విత్తనాలను దించుతున్న దృశ్యం

చీడికాడ: పాడి రైతులకు పశుగ్రాస విత్తనాలు రాయితీపై సిద్ధంగా ఉన్నాయని పెదగోగాడ పశువైద్యాధికారి కె.రాఘవమ్మ బుధవారం తెలిపారు. వంద కిలోల మొక్కజొన్న, 500 కిలోల కాకిజొన్న విత్తనాలు అన్ని రైతు సేవా కేంద్రాల్లో విక్రయిస్తామన్నారు. మొక్కజొన్న కిలో రూ.68, కాకిజొన్న రూ.92గా నిర్ధారించి రైతులకు అందించనున్నట్లు తెలిపారు.

పశుగ్రాస విత్తనాల విక్రయం

మాడుగుల రూరల్: మండలంలో పశుగ్రాస విత్తనాలు 900 కిలోల కాకిజొన్న, 600 కిలోల మొక్కజొన్న 75 శాతం సబ్సిడీపై విక్రయిస్తున్నామని మాడుగుల పశువైద్యశాల ఏడీ వి. చిట్టినాయుడు బుధవారం తెలిపారు. మొక్కజొన్న ఐదు కిలోలు రూ.340 కాగా, సబ్సిడీ రూ.255 పోను రైతు వాటా రూ.85, కాకిజొన్న ఐదు కిలోలు రూ. 460 కాగా, సబ్సిడీ రూ.345 పోను రైతు వాటా రూ.115 చెల్లించాలన్నారు. రెండో దఫా 900 కిలోల కాకిజొన్న, 530 కిలోల మొక్కజొన్న, 6,100 కిలోల అలసంద గడ్డి విత్తనాలు వచ్చాయన్నారు.

రేపు నర్సీపట్నంలో జాబ్ మేళా

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి డాన్‌బాస్కో కళాశాలలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉపేంద్ర తెలిపారు. ఈ మేళాకు హెట్రో, అపోలో, పేటీఎం, ముత్తూట్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. పదో తరగతి, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ పాసైన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 6362508891, 9059190485 సంప్రదించాలని సూచించారు.